క్లుప్తంగా

అధికారుల బదిలీలు..

పాలకొండ రూరల్: మండలంలో ఇంతవరకు పనిచేసిన సీడీపీఓ బి.సిమ్మాలమ్మకు సీతంపేటకు బదిలీ జరిగింది. ఈమె స్థానంలో సీతంపేట సీడీపీఓ రంగలక్ష్మి రానున్నట్లు సిబ్బంది శుక్రవారం తెలిపారు. ఈ క్రమంలో సిమ్మాలమ్మ విధి నిర్వహణలో సహ సిబ్బందికి అందించిన సేవలను సూపర్‌వైజర్లు దశారత్నం, మేరీతో పాటు అంగనవాడీ సిబ్బంది గుర్తు చేసుకున్నారు. స్థానిక ఉద్యానవన అధికారి తమ్మినేని అమరేశ్వరి శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లకు బదిలీపై వెళ్లారు. అయితే అమరేశ్వరికి పాలకొండ ఇన్‌చార్జ్ బాధ్యతలు కూడా అప్పగించారు. పాలకొండ నగర పంచాయతీ మేనేజర్ జయరామ్‌కు విజయనగరం జిల్లా నెల్లిమర్లకు బదిలీ జరిగింది.

రక్తదాతలు ముందుకు రావాలి

పాలకొండ రూరల్: రక్తదానానికి యువత ముందుకు రావాలని స్థానిక ఏరియా ఆస్పత్రి సూపరింటిండెంట్ జి. నాగభూషణరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శనివారం స్థానికి ఏరియా ఆస్పత్రిలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు. అత్యవసర సమయంలో రక్తం అందక చాలా మంది మృత్యువాత పడుతున్నారని.. ఈ సమయంలో రక్త నిల్వలు పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఔత్సాహికులు, యువత రక్తదానం చేయాలని కోరారు.

పీహెచ్‌సీని సీహెచ్‌సీగా మార్చండి



పీహెచ్‌సీని పర్యవేక్షించిన సీపీఎం నాయకులు

బలిజిపేట: బలిజిపేట పీహెచ్‌సీని సీహెచ్‌సీగా మార్చాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బలిజిపేట పీహెచ్‌సీని సీపీఎం నాయకులు శుక్రవారం పర్యవేక్షించి మాట్లాడుతూ పీహెచ్‌సీకి ఓపీ నిమిత్తం 70నుంచి 100మంది పేషెంట్లు వస్తున్నారని, ఇన్‌పేషెంట్లు 10మందికి వరకు ఉంటున్నందున సీహెచ్‌సీగా మార్పుచేయడం వల్ల మరిన్ని సేవలు పెరుగుతాయని దీనివల్ల రోగులకు ఇబ్బందులు తగ్గుతాయన్నారు. ప్రస్తుతం ఖాళీగా ఉండే పోస్టులను భర్తీ చేయాలని కోరారు. పీహెచ్‌సీకి వచ్చే మార్గం రోడ్డు నిర్మాణం చేయాలని, అన్ని సౌకర్యాలు కల్పించి సీహెచ్‌సీగా మార్పుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మన్మథరావు, జి.సత్యనారాయణ, బి.భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ నూతన కమిషనర్ బాధ్యతల స్వీకరణ



కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్.జయరాం

సాలూరు: స్థానిక మున్సి పాలిటీ నూతన కమిషనర్‌గా ఎస్.జయరాం బా ధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించగా కమిషనర్‌కు మున్సిపల్ అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు.

ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్రీనివాసా చారి

సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్రీనివాసాచారి నియమితులయ్యారు. ఆయన నర్సీపట్నం నుంచి బదిలీపై సాలూరు వచ్చారు.

జీఓలు వెంటనే ఇవ్వాలి

పార్వతీపురంటౌన్: ఆశవర్కర్లకు ప్రభుత్వం అంగీకరించిన ఒప్పందాల మేరకు జీఓలు వెంటనే ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ, ఉపాధ్యక్షురాలు ఇందిర యూనియన్ నాయకులు కోరారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యశాఖ సూపరింటెండెంట్ కామేశ్వరరావుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఆశ వర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలని, సెల్‌ఫోన్లు రిపేర్ చేయాలని, సిమ్ కార్డులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. బకాయి వేతనాలు చెల్లించాలని ఇన్సూరెన్స్, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో దమయంతి, హేమలత, లక్ష్మి, పారమ్మ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానికి చెంపపెట్టు

పార్వతీపురం టౌన్: సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు అక్రమ అరెస్టుపై సుప్రీంకోర్టు స్పందించిన తీరుపై పార్వతీపురం నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు అలజంగి జోగారావు స్పందిస్తూ సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న చంద్రబాబు నాయుడికి ఈ తీర్పును చెంపపెట్టుగా భావిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఎన్నో అక్రమ అరెస్టులు మరీ ముఖ్యంగా వాక్ స్వాతంత్ర్యాన్ని కట్టడి చేయాలని కూటమి ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని చెప్పడానికి ఇంతకంటే నిదర్శనం మరొకటి ఉండదన్నారు.

మా పిల్లలను చదువుకు దూరం చేయొద్దు..



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న బెజ్జి గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులు

● అధికారులను వేడుకున్న తల్లిదండ్రులు

పాలకొండ రూరల్: విలీనం పేరిట తమ పిల్లలను చదువుకు దూరం చేయవద్దని బెజ్జి గ్రామానికి చెందిన తల్లిదండ్రులు కోరుతున్నారు. తమ చిన్నారులతో కలిసి శుక్రవారం స్థానిక ఎంఈఓ కార్యాలయానికి చేరుకుని తమ గోడు వెల్లబోసుకున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబాలు తమవని, తాము పనులకు వెళుతూ పిల్లలను ప్రభుత్వ బడిలో చదిస్తున్నామన్నారు. నిబంధనల పేరిట తమ ఊరి బడిని సమీప వీరఘట్టం మండల పరిధిలో గల తలవరంనకు తరలించటంతో ఇబ్బందులు తప్పవని ఆవేదన వ్యక్తం చేశారు. తాము పనులకు వెళితే పిల్లలు కాలినడకన పక్క గ్రామంలో గల బడికి వెళ్లే పరిస్థితి ఉందదని, ఈ కారణంగా పిల్లలు చదువులకు దూరమవుతారని వాపోయారు. తమ బడిని యథాతథంగా కొనసాగించాలని కోరుతూ ఎంఈఓ పత్రి కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఇదే విషయమై గ్రామ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకులు శివ్వాల శ్రీనివాసరావు, వంజరాపు కొండలరావు, తదితరులు అధికారులతో మాట్లాడుతూ.. పిల్లలు, తల్లిదండ్రుల ఆవేదన పరిగణలోకి తీసుకోవాలని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేయాలన్నారు.

పక్క ఊరి బడికి వెళ్లలేం..



గ్రామంలో ఉన్న పాఠశాలను కిలోమీటర్ల దూరంలో ఉన్న తలవరం గ్రామానికి మార్చడం సరికాదు. చిన్న పిల్లలు కాలినడక పక్క గ్రామం ఎలా వెళతారు. వారి భద్రత పరిస్థితి ఏంటి. మధ్య తరగతి కుటుంబాలకు చెందిన పిల్లల తల్లిదండ్రులే అధికం. జీవనోపాధికి మేము కూలికి వెళ్లకపోతే రోజు గడవదు. పిల్లలను రోజూ పక్క గ్రామం తీసుకువెళ్లి, తిరిగి తీసుకురావడం ఎంతో కష్టం. నిబంధనల పేరిట బడిని తరలిస్తే మా పిల్లలు చదువుకు దూరం అవుతారు. తలవరం బడికి మా పిల్లలను ఒంటరిగా పంపించ లేము. అధికారులు మా సమస్యను గుర్తించాలి.

– ఒమ్మి స్వాతి, బెజ్జి గ్రామం

ఆక్రమణలు తొలగించాలి



వినతిపత్రం పరిశీలిస్తున్న తహసీల్దారు బాల

గరుగుబిల్లి: మండలంలోని గిజబ గ్రామంలో ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న స్థలాల్లోని ఆక్రమణలు తొలగించాలని ఆ గ్రామానికి చెందిన మండల శివున్నాయుడు, జి.రామకృష్ణ, జి.శ్రీను, జి.ఎల్లమ్మ కోరుతున్నారు. ఇదే విషయమై వారు మండల కేంద్రంలో తహసీల్దారు పి.బాలకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రహదారికి పక్కన ఉన్న స్థలాలు ఆక్రమించి కంచె వేయడంతో పాటు గొర్రెలకాపర్లు పెంట వేస్తున్నారని ఫిర్యాదు చేశారు. పెంట వల్ల దోమలు, ఈగలు విపరీతంగా పెరగడంతో పాటు దుర్గంధం వెదజల్లుతోందన్నారు. ఆక్రమణల వల్ల రాకపోకలకు కూడా అంతరాయం ఏర్పడుతోందన్నారు. క్షేత్రస్థాయికి సిబ్బందిని పంపించి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు హామీ ఇచ్చారు.

సాగునీటి ప్రాజెక్టులపై మాజీ ఎమ్మెల్యే ఆరా



ఇరిగేషన్ ఎస్ఈతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జయరాజు

జియ్యమ్మవలస రూరల్: కురుపాం నియోజకవర్గ పరిధిలోని చిన్న, మధ్య తరహా సాగునీటి ప్రాజెక్టుల పనితీరుపై మాజీ ఎమ్మెల్యే, ఆదివాసీ జేఏసీ అధ్యక్షుడు నిమ్మక జయరాజు ఆరాతీశారు. మండల కేంద్రంలో నీటిపారుదల శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఆర్.అప్పారావును శుక్రవారం కలిసి ఒట్టిగెడ్డ, గుమ్మడిగెడ్డ, జంఝావతి సాగునీటి ప్రాజెక్టుల ద్వారా ఖరీఫ్ రైతులకు సాగునీరు అందిస్తున్న విధానం అడిగి తెలుసుకున్నారు. ఇన్ని ప్రాజెక్టులు ఉన్నా కొన్నిచోట్ల రైతులు సాగునీటి కోసం అవస్థలు పడుతున్నారని, ఈ ఖరీఫ్ సీజన్ వ్యవసాయ పనులకైనా సాగునీటి ఇక్కట్లు లేకుండా చూడాలని అధికారులను ఆయన కోరారు.

హద్దు మీరితే చర్యలు తప్పవు

● ఎస్సై ప్రయోగమూర్తి



సమస్యలు తలెత్తితే సమాచారం అందించాలంటూ సూచనలు చేస్తున్న ఎస్సై ప్రయోగమూర్తి

పాలకొండ రూరల్: వేడుకల పేరిట జనావాసాల మధ్య హద్దు మీరితే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని ఎస్సై కె.ప్రయోగమూర్తి స్పష్టం చేశారు. పట్టణ పరిధిలోని వివిధ కూడళ్ల వద్ద యువత, మరికొందరు శుభకార్యాలు, పుట్టిన రోజులు, ఇతర వేడుకల పేరిట అర్ధరాత్రి చేస్తున్న హడావిడిపై అందుతున్న ఫిర్యాదులపై పోలీసులు స్పందించారు. తాజాగా జనావాసాల మధ్య, రోడ్లపై చేపట్టిన పార్టీలు, మందుగుండు కాల్చడం వంటి చర్యలపై శుక్రవారం ఆరా తీశారు. ఈ తరహా సంఘటనలపై ఏ క్షణమైనా సమాచారం అందిస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు.

సారా రహిత గ్రామం..పెదతుంబలి



అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాసరావు

జియ్యమ్మవలస: మండలంలోని పెదతుంబలి గ్రామాన్ని నాటుసారా రహిత గ్రామంగా ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు శుక్రవారం ప్రకటించారు. గ్రామ కమిటీ తీర్మానం మేరకు ఈ ప్రకటన చేసినట్లు ఆయన పేర్కొన్నారు. నవోదయం 2.ఓ కార్యక్రమంలో భాగంగా మత్తు పదార్థాల నిర్మూలనపై పోలీస్ శాఖ అవగాహన కార్యక్రమాలు చేపడుతోందని, దీనిలో భాగంగా గ్రామస్తులను కూడా చైతన్యం చేయడం జరిగిందన్నారు. గత కొన్ని నెలలుగా గ్రామంలో సారా తయారీ గానీ, రవాణా గానీ, విక్రయాలు గానీ జరగలేదన్నారు. ఈ నేపథ్యంలో పెదతుంబలి గ్రామాన్ని సారా రహిత గ్రామంగా గుర్తించడం జరిగిందన్నారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొనేలా గ్రామస్తులు చూడాలని సీఐ కోరారు. అనంతరం గ్రామ ప్రధాన వీధులు, జంక్షన్‌ల వద్ద మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు.

తహసీల్దార్‌గా రాధాకృష్ణమూర్తి

పాలకొండ: మండల తహసీల్దార్‌గా రాధాకృష్ణమూర్తిని ప్రభుత్వం నియమించింది. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సీ సెక్షన్ సూపరింటిండెంట్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇంతవరకు ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహించినన బాలమురళీకృష్ణకు బలిజిపేట తహసీల్దార్‌గా బదిలీ చేశారు. బాలమురళీకృష్ణ శుక్రవారం విధుల నుంచి రిలీవ్ కాగా రాధాకృష్ణమూర్తి శనివారం విధుల్లో చేరనున్నారు.

బాధ్యతల స్వీకరణ..

భామిని: మండలంలోని మూడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు ముగ్గురు కొత్త ప్రధానోపాధ్యాయులను కేటాయించారు. ఈ మేరకు వారు శుక్రవారం బాధ్యతలు స్వీకరించి స్థానిక ఎంఈఓ వి. భాస్కరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. బత్తిలి హైస్కూల్ హెచ్ఎంగా పీవీ సన్యాసిరావు, భామిని హెచ్ఎంగా ఎ. మల్లేశ్వరరావు, బాలేరు స్కూల్‌కు కె. కోటేశ్వరరావును కేటాయించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



కడకెల్లలో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై కళాధర్

వీరఘట్టం: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై జి.కళాధర్ సూచించారు. శుక్రవారం రాత్రి మండలంలోని కడకెల్ల, నడిమి కెల్ల గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులు మీకు పంపించే వాట్సాప్ లింక్‌లు ఓపెన్ చేయవద్దని, బ్యాంక్ సిబ్బంది అంటూ ఎవరైనా ఫోన్ చేస్తే అటువంటి వారి మాటలు నమ్మవద్దన్నారు. ఎవరైనా అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి వ్యక్తిగత సమాచారం అడిగితే వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు.

స్థల పరిశీలన..

భామిని: మండల పరిధిలోని మాసగూడ గిరిజన గ్రామంలో మినీ అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణానికి ఘనసర, బాలేరు సహాయ సర్వేయర్లు త్రివేణి, దిలీప్ శుక్రవారం స్థల పరిశీలన చేపట్టారు. అయితే మాసగూడలో మూసివేసిన గిరిజన ప్రభుత్వ పాఠశాల భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహించాలని మాజీ సర్పంచ్ బిడ్డికి సావిత్రి, మోజేస్ సూచించారు. గిరిజన గ్రామంలో స్థల సమస్య ఉన్నందున అధికారులు చొరవ చూపి అందుబాటులో ఉన్న ప్రభుత్వ భవనాలు ఉపయోగించాలని కోరారు.

అభినందనలు...



సూర్యప్రకాశరావు భుక్త

వీరఘట్టం: మండలంలోని పనస నందివాడకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, రైతు నిష్టల సూర్యప్రకాశరావు భుక్తకు ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 60వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గుంటూరులో ఉత్తమ రైతు అవార్డు ప్రదానం చేయడం ఎంతో ఆనందదాయకమని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకున్న భుక్తను శుక్రవారం అభినందించారు. 2023 – 24 సంవత్సరానికి గాను ఈ ప్రాంతంలో అత్యధికంగా చెరుకు ఉత్పత్తి చేసినందుకు గాను ఈ అవార్డు ప్రదానం చేసినట్లు భుక్త తెలిపారు.

మహిళలు ఆర్థికంగా బలపడాలి..



కేక్ కట్ చేస్తున్న మాస్టర్ ట్రైనీ జ్యోతి, తదితరులు

భామిని: మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తూ ఆర్థికంగా బలపడాలని స్థానిక మహిళా కుట్టు శిక్షణ కేంద్రం మాస్టర్ ట్రైనీ సిద్దేశ్వర జ్యోతి అన్నారు. శిక్షణ కేంద్రంలో శుక్రవారం జాతీయ కుట్టు మిషన్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికి పంచి పెట్టారు. కార్యక్రమంలో టింగ హరిబాబు, మండలపరిషత్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌తో బిల్లుల ఆదా



అవగాహన ర్యాలీ చేస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

వీరఘట్టం: సోలార్ రూఫ్‌టాప్‌తో విద్యుత్ బిల్లులు ఆదా చేసుకోవచ్చని ట్రాన్స్‌కో ఏఈ అనిల్‌కుమార్ అన్నారు. సోలార్ విద్యుత్ వినియోగంతో కలిగే లాభాలపై వీరఘట్టం ప్రధాన రహదారిలో శుక్రవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ద్వారా సబ్సిడీపై సోలార్ విద్యుత్ యూనిట్‌లు అందించడం జరుగుతుందన్నారు. భావితరాలకు నాణ్యమైన విద్యుత్ అందించాలంటే సోలార్ విద్యుత్ వినియోగం పెరగాల్సిన ఆవశ్యకత ఉందని అభిప్రాయపడ్డారు. ర్యాలీలో విద్యుత్‌శాఖ సిబ్బంది గుర్రం సుధాకర్, రావాడ మురళీ, అప్పలనాయుడు, బొంతు పవన్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దు

పార్వతీపురం రూరల్: వాహన చోదకులు ప్రయాణించేటప్పుడు నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని పార్వతీపురం పట్టణ సీఐ కె. మురళీధర్ పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలతో పాటు నూతనంగా ప్రభుత్వం జారీ చేసిన జరిమానాలను విధించనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన



సీతంపేట మండలంలోని కుడ్డపల్లి జంక్షన్ వద్ద స్థానిక పోలీసులు రోడ్డు ప్రమాదాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఎస్సై వై. అమ్మన్నరావు మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు తీయవద్దని సూచించారు. అనంతరం సైబర్ నేరాలపై వివరించారు. - సీతంపేట

హిమోగ్లోబిన్ పరీక్షలు..



విద్యార్థుల్లో రక్తహీనతను గుర్తించేందుకు చినగోర ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం రక్త పరీక్షలు నిర్వహించారు. 30 మంది విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించినట్లు హెచ్ఎం కేపీ నాయుడు తెలిపారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ఆరోగ్య పరిరక్షణపై దృష్టి సారించాలని సూచించారు. అలాగే భోజనానికి ముందు, తర్వాత చేతులకు శుభ్రంగా కడగాలని సూచించారు. - వీరఘట్టం

ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకురావాలి



సీతంపేట: సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.తిరుపతిరావు డిమాండ్ చేశారు. ఏడాది పాలనపై సంబరాలు చేసుకుంటున్న కూటమి నాయకులకు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులు ఎనిమిది నెలలుగా నిలిచిపోయిన సంగతి గుర్తు లేదా అని ప్రశ్నించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆస్పత్రి పూర్తయితే గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందుతాయని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జె.మధుసూదన్, పి.వీరన్న, ఎం.లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆమె సేవలు మరువలేం..



సహచరులు అందించిన సహకారం గుర్తుచేసుకుంటున్న ఏపీపీ విజయలక్ష్మి

పాలకొండ రూరల్: స్థానిక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో అనేక కేసులకు సంబంధించి ఏపీపీ విజయలక్ష్మి అందించిన సేవలు మరువలేమని సహచర న్యాయవాదులు కొనియాడారు. ఏపీపీకి విజయనగరం బదిలీ కావడంతో న్యాయమూర్తి చందక హరిప్రియ ఆధ్వర్యంలో శుక్రవారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదుల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సామ్యూల్ మోరా మాట్లాడుతూ.. జూనియర్లకు ఏపీపీ విజయలక్ష్మి ఎన్నో సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో బార్ సభ్యులు కేవీ రమణమూర్తి, జగదీష్‌కుమార్, కె.రవి, బి.రామ్మోహన్, మునిస్వామి, కనపాక సూర్యప్రకాష్, దుప్పాడ ఆనందరావు, కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న గ్రామపెద్దలు

గరుగుబిల్లి: మండలంలోని చిలకాం గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పనిచేసి బదిలీ అయిన ఉపాధ్యాయులు కె.రామ్మోహనరావు, ఎం.మహేష్, జి.రాజశేఖర్‌లను గ్రామపెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు అదే పాఠశాలలో శుక్రవారం సన్మానించారు. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో వారు చేసిన విశేష కృషిని విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

నవధాన్యాల సాగుతో భూసారం



నవధాన్యాలు నాటిస్తున్న ఆర్‌వైఎస్ఎస్ మార్కెటింగ్ ప్రతినిధి భాను

గుమ్మలక్ష్మీపురం: నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని ఆర్‌వైఎస్ఎస్ మార్కెటింగ్ ప్రతినిధి బి.భాను తెలిపారు. మండలంలోని దుడ్డుఖల్లు గ్రామ రైతుల నవధాన్యాల క్షేత్రాలను ఆమె శుక్రవారం పరిశీలించారు. ప్రధాన పంట సాగుకు ముందు నవధాన్యాలు వేసుకుని 45 రోజుల తర్వాత మొక్కలను నేలలో కలియదున్నితే నేలకు అవసరమైన పోషకాలు అందుతాయన్నారు. మెట్టు, పోడు ప్రాంతాల్లో ఎకరా పొలానికి 10 నుంచి 15 కిలోల విత్తనాలు(20 నుంచి 30 రకాల విత్తనాల మిశ్రమం) వేసుకోవాలన్నారు.కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ, మండల ఇన్‌చార్జ్ ఎం.సీతారాం పాల్గొన్నారు.

యోగాపై అవగాహన కల్పించాలి



పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశమైన ఎంపీడీవో పైడితల్లి

గరుగుబిల్లి: ప్రజలకు యోగాపై అవగాహన కల్పించాలని ఎంపీడీవో జి.పైడితల్లి సూచించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో శుక్రవారం సమావేశమైన ఆమె..పలు సూచనలు చేశారు. ప్రతి గ్రామంలోని వృద్ధులు యోగా చేసేలా చూడాలని, వారితో సులువైన యోగాసనాలు వేయించాలన్నారు. యోగాలో పాల్గొంటున్న వారికి ధ్రువీకరణ పత్రాలు కూడా అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు, ఏవో ఎస్.అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా పారిశుధ్య పనులు



పారిశుధ్య పనులు చేయిస్తున్న ఎంపీడీవో పైడితల్లి

గరుగుబిల్లి: మండలంలోని గొట్టివలస గ్రామంలో శుక్రవారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఎంపీడీవో పైడితల్లి పర్యవేక్షణలో జరిగిన ఈ పనుల్లో కాలువల్లో పేరుకుపోయిన పూడికలు తొలగించారు. మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఆమె వెంట సర్పంచ్ బోను చంద్రినాయుడు, డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.